# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం-16-మార్చి-2026 | సంపుటి : 3 | సంచిక : 287 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## డ్రగ్స్ కేసుపై కేటీఆర్

# సమాధానం చెప్పాలి

మహేశ్ కుమార్ గౌడ్

మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఘటనపై రాజకీయ దుమారం

అసెంబ్లీలో ప్రజా ప్రతినిధులందరికీ డ్రగ్స్ పరీక్షలు చేయాలనే సవాల్

డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యాఖ్య



**హైదరాబాద్, మార్చి15 (తెలంగాణ ముచ్చట్లు:**

మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ కేసు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు ఆయన బృందం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. డ్రగ్స్ వంటి తీవ్రమైన అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

మిగతా 2లో..

## ఈ నెల 22 నుంచి

# రైతుభరోసా

తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త

మొదటి విడతలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,590 కోట్లు

సిద్దిపేట జిల్లా నర్మెట్టలో సీఎం చేతుల మీదుగా నిధుల బదిలీ

20 రోజుల తరువాత మరో విడతగా రూ.2,650 కోట్లు జమ

ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు నిధుల పంపిణీ

మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు రూ.9 వేల కోట్ల రైతు భరోసా



**హైదరాబాద్, మార్చి15 (తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద తొలి విడత నిధులను ఈ నెల 22న విడుదల చేయాలని నిర్ణయించింది. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయనున్నారు

మిగతా 2లో..

## నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన లారీ**

**నలుగురు మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు**

**మద్యం మత్తులో లారీ డ్రైవర్ ఉన్నాడని ఆరోపణలు**

**నల్లగొండ, మార్చి 16 (తెలంగాణ ముచ్చట్లు):**

నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చింతపల్లి మండలం చెన్నారం గేటు వద్ద ఆగి ఉన్న ఆటోను వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. సమాచారం ప్రకారం చెన్నారం గేటు వద్ద ప్రయాణికులతో ఉన్న ఆటో రోడ్డుపక్కన ఆగి ఉంది. ఈ సమయంలో వేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి ఆటోను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇద్దరు వ్యక్తులు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

మిగతా 2లో..





## డ్రగ్ టెస్ట్‌కు సిద్ధం..

# కేటీఆర్ స్పష్టం

2లో

మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై తీవ్ర స్పందన

అన్ని పార్టీల నేతలు కూడా పరీక్షలు చేయించుకోవాలని సూచన

ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

## అన్ని మతాలు కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి

ఇఫ్తార్ విందులో సీఎం పిలుపు

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబాటు

ఎల్బీ స్టేడియంలో ఘనంగా రంజాన్ ఇఫ్తార్ విందు

2లో



## చికిత్స పేరుతో అసభ్య ప్రవర్తన ఆరోపణ

- జ్వరంతో వచ్చిన యువతిపై డాక్టర్ అనుచిత ప్రవర్తన
- భయంతో భర్తకు వాట్సాప్‌లో సమాచారం ఇచ్చిన బాధితురాలు
- ఆగ్రహంతో డాక్టర్‌పై దాడి చేసిన కుటుంబ సభ్యులు

2లో

## సిద్దిపేట ప్రజల సేవలోనే ఉంటా: హరీశ్‌రావు

రంజాన్ తోఫాల పంపిణీలో పాల్గొన్న మాజీ మంత్రి

సిద్దిపేట అభివృద్ధిపై హరీశ్‌రావు వ్యాఖ్యలు

కాంగ్రెస్ హామీలపై విమర్శలు

2లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డ్రగ్స్ కేసుపై కేటీఆర్ సమాధానం చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ఈగల్ బృందం రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహిస్తూ డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ చర్యల్లో ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యం లేదని, సమాజాన్ని డ్రగ్స్ ముప్పు నుంచి రక్షించడమే ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కేటీఆర్ మరియు ఆయన అనుచరులు డ్రగ్స్ వినియోగం చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ ఆరోపించారు. అవసరమైతే కేటీఆర్ డ్రగ్స్ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన సవాల్ విసిరారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా అన్ని పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులందరూ డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేస్తోందని మహేశ్ గౌడ్ తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో డ్రగ్స్ సంస్కృతి పెరిగిపోయిందని ఆయన ఆరోపించారు. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

# ఈ నెల 22 నుంచి రైతుభరోసా

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు ఆర్థిక సహాయం త్వరగా అందేలా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆర్థిక సహాయం సమయానికి అందేలా విడతల వారీగా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. మొదటి విడతలో సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. ఒక ఎకరం వరకు భూమి ఉన్న రైతులకు ఈ విడతలో రైతు భరోసా నిధులు అందనున్నాయి. నిధులు నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ అయ్యేలా అవసరమైన



అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు.

మొదటి విడత విడుదలైన 20 రోజుల తర్వాత రెండో విడత నిధులను విడుదల చేయనున్నారు. ఈ దశలో సుమారు రూ.2,650 కోట్లను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అలాగే ఏప్రిల్ నెలాఖరులోగా మూడో విడత నిధులను కూడా విడుదల చేసి మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మూడు విడతల్లో కలిపి దాదాపు రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులు రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి చేరనున్నాయి.

మొదటి విడతగా ఈ నెల 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి 70 లక్షల మంది రైతులకు ఎకరం వరకు రూ.3,590 కోట్లు నిధులను రైతుల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా బదిలీ చేయనున్నారు. తర్వాత మరో 20 రోజులకు రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు వారి ఖాతాల్లోకి బదిలీ చేయనున్నారు. మొత్తంగా 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గారు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి గారు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గారు, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు






# అన్ని మతాలు కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి

**హైదరాబాద్, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో అన్ని మతాలకు చెందిన ప్రజలు కలిసికట్టుగా సోదరభావంతో జీవిస్తూ తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసం కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా విలువలను గుర్తుచేసే పవిత్ర సమయం అని పేర్కొన్నారు. నెల రోజులపాటు ఆత్మ శుద్ధితో జీవిస్తూ ఇతరులకు సహాయం చేయడం, పరస్పర సత్సంబంధాలను కొనసాగించడం రంజాన్ మాసం యొక్క గొప్పతనమని ఆయన అన్నారు. సమాజంలో ఐక్యత, సఖ్యత పెంపొందించడంలో ఈ పండుగ ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. మైనారిటీలకు అవకాశాలు కల్పించేందుకు అనేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి, షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు అప్పగించినట్లు గుర్తుచేశారు. అలాగే క్రికెటర్ సిరాజ్, బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌లకు డీఎస్పీ ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా ఎనిమిది మంది మైనారిటీ నాయకులను వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించినట్లు సీఎం వెల్లడించారు. విద్యా రంగంలో కూడా మైనారిటీలకు అవకాశాలు కల్పిస్తూ ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో ప్రత్యేక సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో మైనారిటీలకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ రంజాన్ పండుగ ప్రజల్లో సఖ్యత, సోదరభావం పెంపొందించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లు అందరూ కలిసి మత సామరస్యంతో రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం మనందరిదని, అందరం కలిసి కష్టపడితేనే రాష్ట్రం మరియు దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, మైనారిటీ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్ టెస్ట్‌కు సిద్ధం.. కేటీఆర్ స్పష్టం

**హైదరాబాద్, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో డ్రగ్స్ అంశంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. బాధ్యత గల ప్రజా ప్రతినిధులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రజల ముందు ఆదర్శంగా ఉండాల్సిన నాయకులు డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను తీసుకోవడం అత్యంత సిగ్గుచేటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవలి కాలంలో తన పేరును అనవసరంగా డ్రగ్స్ కేసులతో అనుసంధానం చేయడం సరైంది కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం ఇలా ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని కేటీఆర్ పేర్కొన్నారు. తాను ఎలాంటి డ్రగ్ పరీక్షకైనా సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ స్పష్టంగా ప్రకటించారు. అవసరమైతే తాను వెంటనే పరీక్ష చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అదే విధంగా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు కూడా డ్రగ్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు సరైన సందేశం ఇవ్వాలంటే రాజకీయ నాయకులే ముందుగా ముందుకు రావాలని, డ్రగ్స్ వంటి సమస్యలపై స్పష్టమైన వైఖరి చూపాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో డ్రగ్స్ వ్యసనం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధుల బాధ్యత మరింత పెరిగిందని ఆయన అన్నారు.

రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరమని కేటీఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం సమాజం మొత్తం బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వం, పోలీసు విభాగం, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు కలిసి పనిచేస్తేనే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కొనగలమని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, అందుకే దీనిపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. డ్రగ్స్ కేసులు ఎక్కడైనా బయటపడితే తన పేరును లాగడం తగదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేయడం రాజకీయంగా తప్పుడు చర్య అని పేర్కొన్నారు. ఇలాంటి ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. నిజానికి ఎవరికైనా డ్రగ్స్ వ్యవహారంతో సంబంధం ఉంటే దాని మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, కానీ నిరాధార ఆరోపణలతో రాజకీయాలను కలుషితం చేయడం సరైంది కాదని ఆయన వ్యాఖ్యానించారు.

# నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రమాదంలో గాయపడిన ఏడుగురిని ముందుగా సమీప ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు బీహార్ రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరు స్థానికంగా ఉన్న బొత్య తండకు చెందిన వారిగా సమాచారం. ప్రమాద సమయంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సిద్దిపేట ప్రజల సేవలోనే ఉంటా: హరీశ్‌రావు

**సిద్దిపేట, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** తనలో శక్తి ఉన్నంత వరకు సిద్దిపేట ప్రజల సేవలోనే కొనసాగుతానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పష్టం చేశారు. సిద్దిపేట అభివృద్ధికి ప్రజల ఆశీర్వాదమే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సిద్దిపేట విద్య, వైద్య రంగాల్లో ముందంజలో నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వెయ్యి పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. సిద్దిపేట మిలాన్ గార్డెన్‌లో సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఫౌండేషన్ అధినేత సాదాత్ నజీర్ సేవలను ఆయన ప్రశంసించారు. నిరుపేదలకు కుల, మత భేదాలు లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అవసరమైన వారికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. పండుగల సమయంలో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో మైనారిటీల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు. షాదీ ముబారక్ పథకం ద్వారా పేద ముస్లిం కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగితే 13 వేల రూపాయల ఆర్థిక సాయంతో పాటు కేసీఆర్ కిట్ అందించేవారని చెప్పారు. అలాగే ఇమామ్‌లు, మోజోన్లకు జీతాలు ఇచ్చిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని భావించి రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనారిటీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు హరీశ్‌రావు తెలిపారు. ఈ పాఠశాలల్లో నమాజుతో పాటు ఇంగ్లీష్ మాధ్యమంలో నాణ్యమైన విద్య అందించామని అన్నారు. ఒక్కో విద్యార్థిపై లక్ష రూపాయల వరకు ఖర్చు చేసి కార్పొరేట్ పాఠశాలలకు సమానంగా విద్య అందించామని తెలిపారు. ఈ గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు మాత్రమే కాకుండా ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అబద్ధపు హామీలు ఇచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లక్ష అరవై వేల రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. ఇమామ్‌లు, మోజోన్ల జీతాలు పెంచుతామని చెప్పినా ఒక్క రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు. కొత్త పథకాలు ప్రవేశపెట్టకపోగా గతంలో అమలులో ఉన్న పథకాలను కూడా నిలిపివేస్తోందని రేవంత్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు.

# చికిత్స పేరుతో అసభ్య ప్రవర్తన ఆరోపణ



**మహబూబాబాద్, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు పట్టణంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. జ్వరంతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన యువతిపై డాక్టర్ అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపణలు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనకు సంబంధించి యువతి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆస్పత్రి వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 21 ఏళ్ల యువతి జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం తొర్రూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ డాక్టర్ కిరణ్ కుమార్ ఆమెను పరీక్షించి ఇంజక్షన్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత డాక్టర్ తనతో అనుచితంగా ప్రవర్తించాడని యువతి ఆరోపించింది. ఈ ఘటనతో తీవ్ర భయానికి గురైన ఆమె వెంటనే తన భర్తకు వాట్సాప్ ద్వారా సమాచారం పంపినట్లు తెలిసింది.

యువతి పంపిన సమాచారంతో ఆమె భర్తతో పాటు కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ విషయంపై డాక్టర్‌ను ప్రశ్నించగా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదని, నిర్లక్ష్యంగా స్పందించాడని బాధితుల బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు డాక్టర్‌పై దాడి చేసి దేహశుద్ధి చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆస్పత్రి వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసి, ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## స్నేహానికి నిదర్శనం... మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన పాఠశాల స్నేహితులు



**పెద్దమందడి,మార్చి15(తెలంగాణ ముచ్చట్లు):** తోటి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటారు పాఠశాల బాల్యమిత్రులు. వనపర్తి జిల్లా పెద్ద మందడి మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన ఎం.డి. నిరంజన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న 1998-99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ఆయన బాల్యమిత్రులు కలిసి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.స్నేహితులు కలిసి రూ.21,000/రూపాయల నగదును నిరంజన్ కుటుంబ సభ్యులకు అందజేసి తమ మద్దతును తెలియ జేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా తమ బాల్యమిత్రుడి పిల్లల చదువుల కోసం ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన ఈ చర్యను స్థానికులు అభినందించారు. ఇలాంటి సహకారం నిజమైన స్నేహానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## నాగారం–రాంపల్లి ప్రాంత కాలనీలకు ఐక్య కమిటీ ఏర్పాటు



**నాగారం, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ నాగారం-రాంపల్లి ప్రాంతాలకు చెందిన వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శుల జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో కాలనీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, నివాసితుల సంక్షేమంపై విస్తృతంగా చర్చించారు. అన్ని కాలనీల అభివృద్ధికి సమన్వయం చేసుకుంటూ సమిష్టిగా పనిచేయడానికి సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఐక్య కమిటీ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి పౌర సమస్యల పరిష్కారానికి కృషి చేయనుంది. సమస్యల పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సకాలంలో చర్యలు తీసుకునేలా పనిచేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.కొత్తగా ఎన్నికైన కమిటీ నాగారం, రాంపల్లి ప్రాంతాల కాలనీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఐక్యత, పారదర్శకత, అంకితభావంతో పనిచేస్తామని వెల్లడించింది.కమిటీ అధ్యక్షుడిగా మాజీటి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ రాజు, ఉపాధ్యక్షులుగా చదలవాడ దేవి వరప్రసాద్ రావు, జాయింట్ సెక్రటరీగా పి. కుమార్ యాదవ్, ఖజాంచీగా ఎం. శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా టీ. రామ్ రెడ్డి, పి.వి. రాఘవ రావు, ఎస్. భాస్కర్ రెడ్డి, హనుమంతరావు ఎంపికయ్యారు.కోఆర్డినేటర్లుగా టీ. జలంధర్ చారి, ఆర్. బాలాజీ చౌదరి, ఎం. రాజేందర్, ఎం. రామకృష్ణ, కిషన్ నాయక్, రాములు, బాలా చారి, ఏ. నరేందర్, కృష్ణ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. అడ్వైజరీ కమిటీ సభ్యులుగా తెల్ల శ్రీధర్, గంగరాజు హరికృష్ణ, రవీందర్ తివారి, దేవరశెట్టి రాజశేఖర్ నియమితులయ్యారు. లీగల్ అడ్వైజర్‌గా విజయ్ కుమార్ రామేవత్‌ను నియమించారు.

## అంబేద్కర్ విగ్రహానికి నివాళులు



**కీసర, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 214వ వారం జ్ఞానమాల కార్యక్రమం ఆదివారం కీసరలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కీసరలోని డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సామాజిక సేవా కార్యకర్త సన్నాల బాబాచారి మాట్లాడుతూ, బహుజనులకు ఆత్మగౌరవం, రాజకీయ ప్రాముఖ్యతను కల్పించిన మహనీయుడు మాన్యశ్రీ కాన్షీరామ్ అని అన్నారు. కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవ్ మరియు కమిటీ సభ్యులు నిర్వహిస్తున్న జ్ఞానమాల కార్యక్రమం మెడ్చల్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు.1934లో జన్మించిన కాన్షీరామ్ భారతదేశంలో బహుజనులు (దళితులు, ఇతర వెనుకబడిన వర్గాలు) హక్కుల కోసం పోరాడిన ప్రముఖ సామాజిక సంస్కర్త మరియు రాజకీయ నాయకుడని పేర్కొన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ స్థాపకుడిగా, "బహుజన్ నాయక్"గా ప్రసిద్ధి చెందిన ఆయన సామాజిక న్యాయం, రాజ్యాధికారం కోసం బహుజనులను ఏకం చేసి అంబేద్కర్ సిద్ధాంతాలను బలోపేతం చేసిన మహనీయుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు పులిపాక తిరుపతి, బొల్లి మహేష్, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శులు సుమన్ బన్నీ, గంగి ఆంజనేయులు, మంచాల మహేష్, తాళ్ళ కిరణ్, ముఖ్య సలహాదారులు దాయర బాల్ నర్సింహ, రాగుల రమేష్ ముదిరాజ్, కీసర బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్‌రాజ్, మండల మాజీ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్, మాజీ ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, నాయకులు మొరుగు క్రాంతికుమార్, అక్కపల్లి అశోక్, గాలిగళ్ల శ్రీనివాస్, దాయర శ్రీనివాస్, నరేందర్ నాయి, బోడ నరేశ్, మొరుగు మహేష్, పుంద్రు రాకేష్, తుడుం బాలకృష్ణ పాల్గొన్నారు.





# హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించిన మంత్రి సీతక్క

**రాంపల్లి, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఘట్‌కేసర్ మండలం రాంపల్లిదాయర వెంకులో గుట్టపై ఉన్న హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఆశీస్సులు స్వీకరించిన మంత్రి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి దేవస్థాన అభివృద్ధి, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య వంటి అంశాలపై అర్చకులు, స్థానిక బాధ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అలాగే ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రిని కలిసి ఆలయానికి సంబంధించిన సమస్యలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# చర్లపల్లి ఐజి కాలనీలో మహిళల కోసం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

**చర్లపల్లి, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజి కాలనీలో మహిళల కోసం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. బొంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణలో ముందస్తు పరీక్షలు చాలా కీలకమని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పిస్తూ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించి ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ వైద్య శిబిరంలో సుమారు 120 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె. సీతారాం రెడ్డి, ప్రభు గౌడ్, గోపాల్ యాదవ్, ప్రకాష్ రెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.





# ఘనంగా ఫాదర్ కొలంబో 100వ జయంతి వేడుకలు

◆ గ్రామీణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం

**ధర్మసాగర్,మార్చి15(తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ సేవామూర్తి ఫాదర్ కొలంబో గారి 100వ జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫాదర్ కొలంబో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ మేత్రాసనా పాలనాధికారి ఫాదర్ విజయ్ పాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫాదర్ విజయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూ ఫాదర్ కొలంబో గారు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ముఖ్యంగా పేద ప్రజలకు విద్యా, వైద్య సేవలు అందించడంలో విశేష కృషి చేశారని అన్నారు. ఆయన సేవా భావం సమాజానికి ఆదర్శమని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ ఆరోగ్య కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ ఫాదర్ కొలంబో గారు మానవతా దృక్పథంతో సమాజ సేవలో ముందుండి పనిచేశారని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య కేంద్రం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ కొలంబో మెడికల్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ఫాదర్ తరుణ్ రెడ్డి, మెడికేర్ హాస్పిటల్ డైరెక్టర్ ఫాదర్ చిన్నపరెడ్డి, విచారణ గురువులు ఫాదర్ సుధాకర్, వంగలపల్లి సర్పంచ్ భూక్యా మేనక, కరుణాపురం సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్, పెద్దపెండ్యాల సర్పంచ్ తోట నాగరాజు, ధర్మాపురం సర్పంచ్ బొమ్మినేని రమాదేవి,నష్కల్ సర్పంచ్ రాజు యాదవ్,ఉప సర్పంచులు,గ్రామ పెద్దలు మరియు విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో ఉచిత కంటి పరీక్షా శిబిరం ప్రారంభం

**మల్లాపూర్, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ స్వామి వివేకానంద నగర్ కాలనీలోని శ్రీరామ క్లినిక్‌లో అను కంటి వైద్యశాల & ఆప్టికల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కాలనీల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం మంచి కార్యక్రమమని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ క్లినిక్ యాజమాన్యం, అను ఆప్టికల్స్ ప్రతినిధులు, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం నింపిన శిశుమందిర్ పాఠశాల విద్యా విహారయాత్ర





**పెద్దమందడి,మార్చి15(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యార్థులకు ఆదివారం ఒకరోజు విద్యా విహారయాత్రను నిర్వహించారు. పాఠశాల మాతాజీలు అరుణ, శశికళ, స్వర్ణరంజిత, సువర్ణ ఆధ్వర్యంలో ఈ విహారయాత్ర జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మన్నెంకొండ దేవస్థానానికి తీసుకెళ్లి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం విద్యార్థులను పాలమూరు (మహబూబ్‌నగర్)లోని పిల్లలమర్రి విజ్ఞాన కేంద్రానికి తీసుకెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన వివిధ విజ్ఞాన ప్రదర్శనలను చూపించారు.అలాగే మయూరి పార్క్‌లోని పచ్చని పందిళ్లలో విద్యార్థులు ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు విజ్ఞాన కేంద్రంలోని నమూనాలు, శాస్త్రీయ ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షిస్తూ కొత్త విషయాలను తెలుసుకున్నారు. చదువుతో పాటు విద్యార్థులకు ఆధ్యాత్మిక విలువలు, చరిత్ర, విజ్ఞానం వంటి అంశాలపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ విహారయాత్రను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.విద్యార్థులు ఈ విద్యా విహారయాత్రను ఎంతో ఆనందంగా ఆస్వాదిస్తూ మంచి అనుభవాన్ని పొందారని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని సరస్వతీ విద్యాపీఠం వనపర్తి జిల్లా అధ్యక్షుడు మన్నోజు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ధనుంజయ గౌడ్, కోశాధికారి గట్టుమీది భానుప్రసాద్, వనపర్తి కేడీఆర్ శిశుమందిర్ కార్యదర్శి అరవింద్ ప్రకాష్, ప్రధానాచార్యులు కిషోర్, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఎల్ల భాస్కర్ తెలిపారు.

# భవానీ నగర్‌లో బస్తీబాటలో పర్యటించిన నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ జోన్ నాచారం సర్కిల్ మల్లాపూర్ 20వ డివిజన్ భవానీ నగర్ కాలనీలో బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని కాలనీ ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్థానికులు కాలనీలో నెలకొన్న డ్రైనేజ్ సమస్యలు, మౌలిక సదుపాయాల కొరత వంటి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న నెమలి అనిల్ కుమార్ వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని, భవానీ నగర్ కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో భవానీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ నివాసితులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కాప్రాలో ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్ల పంపిణీ







**కాప్రా, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ డివిజన్ సాయిబాబా నగర్‌లోని జామియా మస్జీద్‌ఈనూరి మసీదులో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ సందర్భంగా "ఈద్ కా తోఫా" కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి డివిజన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా స్వర్ణరాజు శివమణి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం "ఈద్ కా తోఫా" కిట్లను పంపిణీ చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న ఈ రంజాన్ తోఫా కిట్లు మంచి నాణ్యతతో ఉన్నాయని, పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అలాగే ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మైనారిటీ నాయకులు మరియు ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు సయ్యద్ ముర్తుజా, షేక్ చోటు భాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ కిట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ ముర్తుజా మాట్లాడుతూ సాయిబాబా నగర్ ప్రాంతంలోని పేద ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వ రంజాన్ తోఫా అందేలా కృషి చేసిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కాప్రా డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి, మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విఠల్ నాయక్, పడమటి మల్లారెడ్డి, జి. సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, మచ్చ శ్రీకాంత్ గౌడ్, షాబుద్దీన్, మహమ్మద్ ఆరిఫ్, సిద్ధిక్, కే. రాజు, ప్రదీప్, వినయ్, కాప్రా డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, మసీదు సదర్ జలీల్ పాషా పాల్గొన్నారు.



# ఆడబిడ్డ పెళ్లికి సర్పంచ్ కానుకగా 5116 అందజేత

**వేలేరు,మార్చ్15(తెలంగాణముచ్చట్లు):** వేలేరు మండలంలోని పీచర గ్రామానికి చెందిన గొల్లెన స్వామి - రాధ దంపతుల ఏకైక కుమార్తె సమీరా - బన్నీ వివాహం ఈరోజు పీచర గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు ఆదేశాల మేరకు గ్రామ ఉప సర్పంచ్ గుడికందుల ప్రశాంత్, 8వ వార్డు సభ్యుడు గుడికందుల రాకేష్, సమ్మక్క-సారక్క దేవస్థానం చైర్మన్ గొల్లెన రమేష్, అవునూరి శ్యామ్, ఏలూరి కల్యాణ్, నకిర్త రమేష్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు గారి తరఫున 5116 రూపాయలు పెళ్లి కానుకగా అందజేశారు.



# మసీదులో రంజాన్ తోఫాలు పంపిణీ

**నాచారం , మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయ నగర్ మసీదులో రంజాన్ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాలను మాజీ కార్పొరేటర్లు జెర్రిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం సోదరుల కోసం అమలు చేసిన రంజాన్ కానుక పథకాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగించడం మంచి విషయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షులు అలీముద్దిన్, సెక్రటరీ నిసార్ అహ్మద్ గోరి, సలీం భాయ్, మౌలా, అఫ్రోజ్, ఇమ్రాన్, ఫరూక్, జాకీర్, మహమ్మద్ తాహెర్, ఫక్రీ, మహమ్మద్ వసీం తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.



# లైఫ్ లైన్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయం

◆ డాక్టర్ కూరపాటి ప్రదీప్

**ఖమ్మం బ్యూరో, మార్చి 15(తెలంగాణ ముచ్చట్లు) :** లైఫ్ లైన్ ఫౌండేషన్ నిరుపేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమనిప్రముఖ పిల్లల వైద్యులు, అభయ హాస్పిటల్ సీఈవో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ అన్నారు. ఆదివారం ఎన్.ఎస్. టీ రోడ్డు లో గల అంజుమ్ క్లినిక్ ఆవరణలో నిరుపేద ముస్లిం లకు లైఫ్ లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్న రంజాన్ కిట్ల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని , మాట్లాడారు. తొలుత తన చేతుల మీదుగా నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ లైఫ్ లైన్ పౌండేషన్ ఏర్పాటు చేసి ,ఇటువంటి సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలో లైఫ్ లైన్ ఫౌండేషన్ ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో ఇటువంటి సంస్థల అవసరం ఎంతైనా ఉందని, ఫౌండేషన్ చేసే ప్రతి మంచి పనికి తన వంతు సహాయం ,సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా లైఫ్ లైన్ ఫౌండేషన్ సభ్యులు , మిత్రబృందం డాక్టర్ కూరపాటి ప్రదీప్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ . జానీ మియా వారి మిత్ర బృందం షేక్ .ఇమ్రాన్ , డాక్టర్. మొహమ్మద్ అల్తాఫ్ , షేక్. మన్సూర్ అలీ , యం డి. రహీం , మీరాజోదన్ , యం డి. ఆసిఫ్ , మహమ్మద్ ఖదీర్ , సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో

# శ్రమదానం ఈ-వేస్ట్ సేకరణ





**కాప్రా, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుషాయిగూడ డివిజన్‌లో పలు శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీఐఐసీ కాలనీలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమాన్ని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ప్రారంభించారు. సాయి సుధీర్ డిగ్రీ మరియు పీజీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొని కాలనీ గ్రౌండ్ మరియు వీధులను శుభ్రపరిచి చెత్తాచెదారం, రోడ్ల పక్కన ఉన్న మట్టి కుప్పలు, రాళ్లు, చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగం సిబ్బంది, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అధికారి రవి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్ సుధీర్, రామకృష్ణ, ఎస్ఎఫ్ఏలు శివకృష్ణ, కె.లక్ష్మి, కాలేజ్ ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ మహేందర్ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా విద్యార్థుల సేవాభావాన్ని డిప్యూటీ కమిషనర్ అభినందించారు.

అలాగే జై జవాన్ కాలనీ పార్కులో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. పార్కులోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, రాళ్లను తొలగించి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ మరియు కాప్రా ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షుడు జ్యోతిష్మయ చారి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ అశోక్, ఎన్ఎస్ఎస్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఇక వంపుగూడ డివిజన్ పద్మారావు నగర్ కాలనీలో ఈ-వేస్ట్ కలెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ప్రారంభించారు. వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని కాలనీలో తిరిగి ఈ-వేస్ట్ సేకరించారు. మొత్తం 160 కిలోల ఈ-వేస్ట్‌ను సేకరించి రీకో ఏజెన్సీకి అందజేశారు. ఏజెన్సీ రేటు ప్రకారం కాలనీవాసులకు నగదు చెల్లింపులు చేశారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అధికారి రవి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్ రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు వసంత, శిరీష, ఇన్‌చార్జ్ అంజలి మరియు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి మాట్లాడుతూ కాలనీవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ సహకరించి ఈ-వేస్ట్‌ను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు.

## ఎదులాపురంలో ఘనంగా 'రంజాన్ తోఫా' పంపిణీ




- **ముస్లిం సోదర సోదరీమణులకు కిట్ల అందజేత**
- **ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు**

**ఖమ్మం బ్యూరో, మార్చి 15(తెలంగాణ ముచ్చట్లు):** ముస్లింల పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ఎదులాపురం మున్సిపాలిటీ 13వ వార్డులో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మజీద్ఏమదీనా కమిటీ మరియు రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో వార్డులోని ముస్లిం సోదర సోదరీమణులకు ఈ తోఫాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మద్దెలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు మాట్లాడుతూ.. పండుగ వేళ పేద ముస్లిం కుటుంబాల్లో సంతోషం నింపేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం మరియు కమిటీల సహకారంతో లబ్ధిదారులకు ఈ కిట్లను పంపిణీ చేశారు. పాల్గొన్న ప్రముఖులు:ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ బైరు కోటేశ్వరరావు, 9వ వార్డు కౌన్సిలర్ కందుకూరి వెంకటనారాయణ, 8వ వార్డు కౌన్సిలర్ సుశీల తనయుడు సంగాని వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు మెండెం వెంకటేష్ యాదవ్, పాలేరు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఇన్చార్జ్ షేక్ నజీరుద్దీన్, మజీద్ అధ్యక్షులు మొహమ్మద్ మోయిన్, 13వ వార్డు రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యక్షులు షేక్ జాఫర్, ప్రధాన కార్యదర్శి జానీ ఖాన్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర: వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో పాటు షేక్ యాసిన్, షేక్ అబ్దుల్ జబ్బర్, షేక్ మౌలాలి, షేక్ జానీ మియా, మొహమ్మద్ అప్సర్, షేక్ మస్తాన్, ఎండి వాజిద్, కాశబోయిన శ్రీనివాసరావు, సోమ సత్యనారాయణ, గంగిశెట్టి కొండల్, మువ్వా శ్రీనివాస్ మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంబరాన్నంటిన స్మార్ట్ కిడ్జ్ పాఠశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- **చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందించిన నగర మేయర్ పూనకొల్లు నీరజ, కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణ చైతన్య, డైరెక్టర్ సుకన్య.**
- **కనువిందు చేసిన చిరు మువ్వల సందడి.**



**ఖమ్మం బ్యూరో, మార్చి 15(తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే సంబురాలు అంబరాన్నంటాయి. డిజిటల్ లైట్ల వెలుగుల్లో అతిపెద్ద వేదికపై చిన్నారులకు నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పట్టాలు అందుకున్న చిన్నారులు మురిసిపోయారు. చిరు మువ్వల సందడితో నృత్యాలు చేస్తూ అతిథులను ,తల్లిదండ్రులకు చిన్నారులు స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణ చైతన్య పర్యవేక్షణలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు నగర మేయర్ పూనకొల్లు నీరజ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మేయర్ పూనుకొల్లు నీరజ మాట్లాడుతూ ఈ పాఠశాలలోని చిన్నారులు ఒత్తిడి లేని చదువులతో స్వేచ్ఛగా ఆడుతూ పాడుతూ గ్రాడ్యుయేషన్ డే పట్టాలు అందుకోవడం హర్షనీయంఅన్నారు. చిన్నారులు స్టేజి పైకి ధైర్యంగా వచ్చి మురిసిపోతూ గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకోవడమే కాకుండా హుషారుగా నృత్యాలు ప్రదర్శించడం ముచ్చటేస్తుందని తెలిపారు. చిన్నారుల నుంచి మొదలుకొని ఐదవ తరగతి విద్యార్థుల వరకు ప్రాథమిక విద్యను అందించడంలో ఖమ్మం నగరంలో తిరుగులేని విద్యాసంస్థగా స్మార్ట్ కిడ్జ్ పాఠశాల విద్యా సేవలు అందించడం గర్వించదగిన విషయం అన్నారు. విద్యార్థులను ఆల్ రౌండర్ లు గా తీర్చి దిద్దుతున్న స్మార్ట్ కిడ్జ్ పాఠశాలకు తల్లిదండ్రులు ఎల్లప్పుడూ తమ సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధతో విద్యను అందించడం వలన గత 14 సంవత్సరాలుగా తల్లిదండ్రులు తమ పాఠశాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ డే అనేది చిన్నారులలో మధుర జ్ఞాపకంగా నిలిచిపోవాలనే ఉద్దేశంతో ఈ వేడుకను గ్రాండ్ గా నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య మాట్లాడుతూ చిన్నారులపై ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని చిన్నారుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రత్యేక విద్యా విధానం ద్వారా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డి ఎం అండ్ హెచ్ ఓ కళావతి భాయి ,స్థానిక కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు . సభలో గ్రాండ్ పేరెంట్స్, పేరెంట్స్ వేదికపై తమ చిన్నారులకు స్మార్ట్ కిడ్జ్ పాఠశాల అందిస్తున్న ఒత్తిడి లేని విలువలతో కూడిన విద్యను నేర్పుతున్న విధానాన్ని ప్రశంసించారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందించారు. డిజిటల్ లైట్ల వెలుగుల్లో గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న చిన్నారులు పలు రకాల సంస్కృతిక కార్యక్రమాలలో కనువిందు చేశారు. సాంప్రదాయ, జానపద, సినిమా పాటలకు స్టెప్పు లేస్తూ కేరింతలు కొడుతూ వేదికపై సందడి చేశారు. తమ చిన్నారులు గ్రాండ్ గా వేదికపై గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకోవడం నృత్యాలతో అలరించడంతో తల్లిదండ్రులు మురిసిపోయారు.

## పారిశుధ్య కార్మికులకు సన్మానం

**హసన్ పర్తి, మార్చ్ 15(తెలంగాణ ముచ్చట్లు):** హసన్ పర్తి మండలం జయగిరి గ్రామ పారిశుధ్య కార్మికులకు సన్మానకార్యక్రమం నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహితున్న ప్రజా పాలనకు 99 రోజుల ప్రగతి ప్రణాళిక మార్చ్ 06 నుండి జూన్ 12 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆదివారం రోజున జయగిరి పారిశుధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం సర్పంచ్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సెక్రటరీ రవీందర్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కె.హేమంత్ కుమార్,వై.రంజిత్, బి. అనూష,కారోబార్ శ్రీధర్,రేణుకుంట్ల అశోక్,పారిశుధ్య కార్మికులు రేణుకుంట్ల సరోజన,రేణుకుంట్ల ఐలమ్మ,రేణుకుంట్ల రాజయ్య,రేణుకుంట్ల ప్రభాస్,నదునూరి అనిల్,రేణుకుంట్ల ప్రమీల, మండల మధు, దండ బోయిన చంద్రకుమార్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఘనంగా మాజీ ఎంపీ నామ జన్మదిన వేడుకలు

- ప్రజా సేవలో ముందుండే నాయకుడు నామ: ఎమ్మెల్సీ తాత మధు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా మాజీ ఎంపీ నామ జన్మదిన వేడుకలు



**ఖమ్మం బ్యూరో, మార్చి 15(తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు జన్మదిన వేడుకలను ఆదివారం నాడు ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాత మధుసూదన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తాత మధుసూదన్ కేక్ కట్ చేసి నామకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తాత మధు మాట్లాడుతూ నామ నాగేశ్వరరావుకు జిల్లా పార్టీ తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గత మూడు దశాబ్దాలుగా ప్రజా సేవలో నామ చేసిన కృషిని కొనియాడారు. ప్రజా జీవితంలో మరింత సేవ చేస్తూ, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశా నిర్దేశం, కేటీఆర్ నాయకత్వంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నామ జన్మదిన వేడుకలు శనివారం అర్ధరాత్రి నుంచే ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాత్రి 12 గంటలు దాటగానే కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ నామకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలు ప్రాంతాల్లో యువకులు భారీ కేక్‌లను కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరిపారు. అలాగే ఆదివారం ఉదయం నుంచే పలు దేవాలయాల్లో నామ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం నామ క్యాంప్ కార్యాలయ ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉప్పల వెంకట రమణ, పగడాల నరేందర్, మాజీ సర్పంచ్ మెంటెం రామారావు ఆధ్వర్యంలో ఖమ్మం జీవన్ సంధ్య వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, పాలేరు, వైరా, మధిర, కొత్తగూడెం, అశ్వారావుపేట తదితర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో పండ్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పేదలకు భోజనం అందించేందుకు పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వైరా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నామ పుట్టిన రోజు సందర్భంగా ఇఫ్తార్ విందు కూడా ఏర్పాటు చేశారు. నామ నాగేశ్వరరావు రాజకీయాల్లోకి రాకముందు నుంచే ప్రజా సేవలో ముందుండే వ్యక్తి అని అభిమానులు తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మరించుకున్నారు. రాజకీయంగా మాత్రమే కాకుండా సామాజిక సేవలో కూడా నామ ముందుండి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన నాయకుడిగా నామ నాగేశ్వరరావు పేరు నిలిచిపోయిందని అభిమానులు అన్నారు. నామ నాగేశ్వర రావు ఆయురారోగ్యాలతో మరింత కాలం ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ అభిమానులు, శ్రేయోభిలాషులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఖమ్మం నగర పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషాబోయిన వీరన్న, కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి, తోట రామారావు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషాబోయిన వీరన్న, కనగాల వెంకట్రావు, నాయకులు బోజెడ్ల రాంమోహన్, పెనుగొండ ఏడుకొండలు, తన్నీరు రవి, ముత్యాల వెంకటఅప్పారావు, కోటి అనంతరాములు, బంకా మల్లయ్య, మరికంటి రేణుబాబు, వాకదాని కోటేశ్వరరావు, మందడపు వెంకటేశ్వరరావు, కోడె బాబు, కనగాల వెంకటేశ్వర్లు, నామ వెంకన్న, కొత్తపల్లి నాగార్జున, కోటేష్, బలుసు మురళి కృష్ణ, మహమ్మద్ రఫీ, మహిళా నాయకురాలు చిత్తారు ఇందుమతి, ఎమ్మెల్సీ తాత మధు పీఏ సుమంత్, మాజీ ఎంపీ నామ వ్యక్తిగత కార్యదర్శి గోపాళం నాగరాజు, యువ నాయకులు పాల్వంచ రాజేష్, తాళ్లూరి హరీష్ బాబు, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణ ప్రసాద్, పగడాల రవి, షారుఖ్, మునిగంటి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

# నాగారం లో శ్రీనివాస బేకరీ ప్రారంభోత్సవం



**నాగారం, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ మెయిన్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస బేకరీ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కీసర మండలం మాజీ జెడ్పిటిసి ముప్పు రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బేకరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతరహా వ్యాపారాలు అభివృద్ధి చెందడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ప్రాంతీయంగా వ్యాపార రంగం అభివృద్ధి చెందడం ఆనందకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘనపురం కొండల్ రెడ్డి, కందాడి యాదం రెడ్డి, మాదిరెడ్డి రాజిరెడ్డి, బుల్లబోయిన ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరించిన రావుల చంద్రశేఖర్ రెడ్డి



**వనపర్తి,మార్చి15(తెలంగాణ ముచ్చట్లు):** కొత్త తెలుగు సంవత్సరం "శ్రీ పరాభవ" నామ సంవత్సరానికి రూపొందించిన పంచాంగాన్ని మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు.పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాంగాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.తెలుగు ప్రజల ముఖ్య పండుగ అయిన ఉగాది షడ్రుచుల సమ్మేళనమని, జీవితం లో వచ్చే కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, కందూరు నారాయణ రెడ్డి, బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, దేశి రాములు యాదవ్, సి. కిరణ్ కుమార్, గంధం నాగరాజు, విజయ్, డా. కంటే నిరంజనయ్య, డా. ఎన్. నరసింహ శర్మ, బుజ్జిబాబు, ప్రవీణ్ కుమార్, నందిమల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

# వేలేరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ




**వేలేరు, మార్చ్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వేలేరు ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ మెయిన్ బ్రాంచ్ సహకారంతో నిర్వహించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, బ్యాంకు ప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వంగర గ్రామంలో పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం



**భీమదేవరపల్లి, మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామ పరిశుభ్రత మరియు ప్రజల ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులను గౌరవిస్తూ వంగర గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల పరిసరాలు, విద్యాసంస్థల పరిశుభ్రత-పారిశుధ్యం కార్యక్రమం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం విశేషం.

ఈ సందర్భంగా వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామంలో నిరంతరం పరిశుభ్రత పనులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి అభినందించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి కృషి ఎంతో విలువైనదని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం చాలా అవసరమని చెప్పారు. ఈ దిశగా పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో పారిశుధ్య కార్మికులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తామని, వారి సేవలను గ్రామ ప్రజలు గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సన్మానితులైన పారిశుధ్య కార్మికులు సమ్మయ్య, రమేష్, కుమారస్వామి, ఐలమ్మ, రజిత, కల్పన, పూర్ణచందర్, విక్రం. వీరంతా గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజల ప్రశంసలు పొందుతున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రమేష్, వార్డ్ సభ్యులు శ్రీరామోజు మొండయ్య, బత్తిని రజిత, మారం సతీష్, కాల్వ అంజలి, ఖండే శారద, మిడిదొడ్డి తిరుపతి, వేముల సాధన, రఘునాకుల మహేష్ రెడ్డి, గజ్జల రమేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పరిశుభ్రత కోసం అందరూ కలిసి పనిచేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ సన్మాన కార్యక్రమం ద్వారా పారిశుధ్య కార్మికుల సేవలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలుపుతూ వారిని ప్రోత్సహించారు. గ్రామాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచే దిశగా ఈ కార్యక్రమం మంచి సందేశాన్ని అందించింది.

# నాగిలిగొండలో ఘనంగా ఇఫ్తార్ విందు

## పాల్గొన్న నాయకులు గడ్డం శ్రీనివాస్



**ఖమ్మం బ్యూరో, మార్చి 15(తెలంగాణ ముచ్చట్లు):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మధిర నియోజకవర్గం నాగిలిగొండ గ్రామంలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గ నాయకులు గడ్డం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ముస్లిం సోదరులతో కలిసి ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి మరియు సోదరభావానికి ప్రతీక అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్ తో పాటు స్థానిక ముస్లిం పెద్దలు మరియు నాయకులు పాల్గొన్నారు. వారిలో: బిఆర్ఎస్ మండల మైనార్టీ నాయకులు ఎస్.కె షరీఫ్, జర్నలిస్ట్ మదర్ సాహెబ్, మీరా సాహెబ్,హుస్సేన్ ఫకీర్ సాహెబ్ మౌలాలి ఖాసిం సైదులు అహ్మద్ పాషా నాగుల్ మీరా లాల్ పాషా షరీఫ్ సింగాల అచ్చయ్య బోరిగార్ల నాగరాజు మరియు గ్రామంలోని పలువురు ప్రముఖులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఇఫ్తార్ విందు గ్రామస్తుల మధ్య ఐక్యతను చాటిచెప్పింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్



# ప్రజా ఐక్యత గీతం

పర్వత శిఖరములపై పలికిన కవితా నాదమది
పృథ్వీ గర్భమంతట పరిమళించి విరజిల్లె;
భాషల గోడలన్నియు భగ్నమగునని బోధించి
భావాల సేతువై మానవ హృదయములను కలిపె.

కులమత భేదముల కలుషిత చీకటిలో
కరుణా కాంతిరేఖలై కవిత వెలుగె;
విభేద వలయముల విరిచి సమత్వ మార్గమున
సామరస్య సుగంధమై సమాజమున పరచె.

పేదవాని నిశ్వాసము, ధనవాని గర్వగీతము
ఒకే రాగమై కలిసిన క్షణమున
సమానత్వ సత్యమై సమాజ గర్భమందు
స్నేహ స్వరమై సర్వలోకమున మార్మోగె.

సరిహద్దు రేఖలతో భూమిని చీల్చిన చేతులకన్నా
స్నేహసూత్రమే శాశ్వతమని కాలమే చెప్తుంది;
మనసుల నదులన్నియు ఒకే సముద్రమై చేరగా
మానవత్వమే జగతికి మహాసంగీతమవుతుంది.

కావున కవిత కేవలం పదాల అలంకారముకాదు—
ప్రజల హృదయాలను కలిపే పవిత్ర జ్యోతి అది;
ప్రపంచ కవితా స్వరమై మార్మోగిన వేళ
ప్రజల ఐక్యత రాగమే భూమికి శాశ్వత గీతమవుతుంది.



రచన: మంజుల పత్తిపాటి
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం, చరవాణి: 9347042218

# జాతీయ పోటీలకు అర్హత సాధించిన యువ అథ్లెట్లు

**మేడ్చల్ మల్కాజిగిరి , మార్చి 15 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 3వ రిలే కార్నివాల్ అథ్లెటిక్స్ పోటీలలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన అథ్లెట్లు విశేష ప్రతిభ కనబరిచారు. కోచ్ తిరుమల రావు శిక్షణలో ఉన్న విద్యార్థులు పలు విభాగాల్లో మెడల్స్ సాధించి జిల్లాకు గౌరవం తీసుకొచ్చారు. ఈ పోటీల్లో అండర్-20 విభాగంలో గరిగే అభినయ శ్రీ 100 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించగా, మహిళల 400 మీటర్ల పరుగులో పోత్రకుండ సరిత స్వర్ణ పతకం గెలుచుకున్నారు. అలాగే పురుషుల 100 మీటర్ల పరుగులో తిరుమల కాంస్య పతకం అందుకున్నారు. అండర్-14 బాలికల 600 మీటర్ల పరుగులో ఎస్. గౌతమి, ఎం. దీపిక ఫైనల్స్‌కు అర్హత సాధించి మంచి ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు ఈనెల 28న చండీగఢ్ లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా విజేతలను కోచ్ తిరుమల రావు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కీలక మార్పు

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో ఈసారి కీలక మార్పు చోటుచేసుకుంది. గత ఎన్నికల్లో ఎనిమిది దశల్లో జరిగిన పోలింగ్‌కు బదులుగా ఈసారి కేవలం రెండు దశల్లోనే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ నిర్ణయం బెంగాల్ రాజకీయాల్లో చర్చకు దారితీస్తోంది. ఈ షెడ్యూల్ ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23 మరియు ఏప్రిల్ 29 తేదీలలో రెండు దశల్లో పోలింగ్ జరుగుతుంది. అనంతరం మే 4న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడించనున్నారు. గతంలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ దశలను భారీగా తగ్గించడం ఎన్నికల నిర్వహణలో ముఖ్యమైన మార్పుగా భావిస్తున్నారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో మార్చి చివరి వారంలో పోలింగ్ ప్రారంభమై ఏప్రిల్ 29 వరకు కొనసాగింది. దాదాపు నెల రోజులపాటు ఎనిమిది దశల్లో ఎన్నికలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది వినియోగం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని అప్పట్లో ఎక్కువ దశల్లో పోలింగ్ నిర్వహించారు. ఈసారి మాత్రం విస్తృతంగా చర్చలు జరిపిన తర్వాత పోలింగ్ దశలను తగ్గించాలని ఎన్నికల సంఘం నిర్ణయించినట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు. ఇదే సమయంలో అస్సాం, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నికలు ఒక్కో దశలోనే జరగనున్నాయి. అస్సాం, కేరళ, పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న పోలింగ్ నిర్వహించగా, తమిళనాడులో ఏప్రిల్ 23న ఓటింగ్ జరుగుతుంది. మే 4న అన్ని రాష్ట్రాల ఫలితాలు ఒకేసారి వెల్లడించనున్నారు.



# హోర్ముజ్ జలసంధిపై ఉద్రిక్తతలు

ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి అంశం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ కీలక సముద్ర మార్గాన్ని తిరిగి తెరిచి నౌకల రవాణా సజావుగా సాగేందుకు ప్రపంచ దేశాలు తమ యుద్ధ నౌకలను పంపాలని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచానికి భారీగా చమురు సరఫరా జరుగుతుండటంతో ఈ మార్గం అత్యంత కీలకంగా మారింది. ఇటీవల జరిగిన యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ ఈ జలసంధి మార్గాన్ని మూసివేసింది. దీంతో గల్ఫ్ ప్రాంతం నుంచి చమురు, ఇతర వస్తువుల రవాణా తీవ్రంగా ప్రభావితమైంది. అనేక దేశాలకు చెందిన నౌకలు ఈ మార్గంలో నిలిచిపోవడంతో ప్రపంచ మార్కెట్లపై కూడా ప్రభావం పడుతోంది. కొద్ది దేశాలకు చెందిన నౌకలకు మాత్రమే పరిమిత అనుమతులు ఇస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో నౌకల రవాణా భద్రత కోసం అమెరికా తన యుద్ధ నౌకలను పంపేందుకు సిద్ధంగా ఉందని ట్రంప్ ప్రకటించారు. అలాగే అమెరికా మిత్ర దేశాలు కూడా తమ నౌకాదళాన్ని ఈ ప్రాంతానికి పంపి రవాణా మార్గాన్ని భద్రపరచాలని ఆయన కోరారు. సముద్ర మార్గాలు తెరవబడితే ప్రపంచ వ్యాపారానికి మళ్లీ ఊపిరి అందుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ఇరాన్ కొన్ని షరతులతో నౌకల రాకపోకలకు అనుమతిస్తామని తెలిపింది. ముఖ్యంగా చైనా కరెన్సీ యువాన్‌లో లావాదేవీలు జరిపే నౌకలకు అనుమతి ఇవ్వాలని సూచించింది. అయితే అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన నౌకలను మాత్రం అనుమతించబోమని ఇరాన్ ప్రకటించడంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# పోలో కప్ ఫైనల్‌కు హాజరైన రాజ్‌నాథ్ సింగ్




ఆదిత్య బిర్లా మెమోరియల్ పోలో కప్ ఫైనల్ పోటీలను కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో వీక్షించారు. ఈ సందర్భంగా పోలో క్రీడ అభివృద్ధిలో భారత సైన్యం చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. పోలో క్రీడకు ఉన్న గొప్ప వారసత్వాన్ని కాపాడటంలో సైన్యం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. పోలో క్రీడలో ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తించి ప్రోత్సహించడంలో భారత సైన్యం ప్రత్యేకంగా కృషి చేస్తోందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ క్రీడకు ఉన్న సంప్రదాయాన్ని నిలబెట్టడంలో సైన్యం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడం ద్వారా పోలో క్రీడ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భారత పోలో సంఘంతో కలిసి భారత సైన్యం ఈ క్రీడను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన తెలిపారు. ఈ సహకారం వల్ల పోలో క్రీడ దేశంలో మరింత ప్రాచుర్యం పొందుతుందని అన్నారు. పోలో వంటి సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించడం ద్వారా క్రీడా రంగానికి కొత్త ఊపిరి లభిస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో పోలోతో పాటు ఇతర క్రీడలకు కూడా ప్రోత్సాహం అందించే దిశగా కలిసి పనిచేయాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. యువ క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తే వారు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి కీర్తి తీసుకువస్తారని అన్నారు. క్రీడా రంగం అభివృద్ధి చెందితే దేశ యువతకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# ఎల్పీజీ కొరతతో పాఠశాలలో విచిత్ర ఘటన

ఎల్పీజీ కొరత ప్రభావం దేశవ్యాప్తంగా పలు రంగాలపై పడుతున్న నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఘటన చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద అన్నం, కూరలు వడ్డించాల్సి ఉండగా గ్యాస్ కొరత కారణంగా విద్యార్థులకు పానీపూరీలు అందించడం సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ వేడి ఆహారం అందిస్తుంటారు. సాధారణంగా పాఠశాల ప్రాంగణంలోనే వంటచేసి పిల్లలకు భోజనం వడ్డిస్తారు. అయితే ఇటీవల ఎల్పీజీ సిలిండర్ల కొరత ఏర్పడటంతో కొన్నిచోట్ల వంట చేయడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లోని భద్రకాళి ప్రాంతంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో కూడా ఇదే సమస్య ఎదురైంది. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో సాధారణ మధ్యాహ్న భోజనం వండలేకపోయారు. దీంతో విద్యార్థులకు తక్కువ గ్యాస్‌తో సిద్ధం చేయగలిగే పానీపూరీలు అందించారు. విడుదలైన వీడియోలో పిల్లలు వరుసగా నిలబడి తమ ప్లేట్లలో పానీపూరీలు తీసుకుంటున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ వీడియోను అక్కడి ఒక ఉపాధ్యాయుడు సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అది వేగంగా వ్యాప్తి చెందింది. కొందరు పిల్లలకు ఏదో ఒక ఆహారం అందించడం మంచిదని అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు ఇది సరైన పోషకాహారం కాదని విమర్శిస్తున్నారు. ఈ ఘటనతో ఎల్పీజీ కొరత ప్రభావం సాధారణ ప్రజల జీవితాలపై ఎలా పడుతుందో స్పష్టంగా కనిపిస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# ‘ఉస్తాద్ భగత్ సింగ్’ ట్రైలర్‌పై చిరంజీవి ప్రశంసలు.. పెరిగిన అంచనాలు

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన “ఉస్తాద్ భగత్ సింగ్” చిత్రం ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌కు అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ట్రైలర్‌లో పవన్ కల్యాణ్ శక్తివంతమైన పోలీస్ అధికారిగా కనిపిస్తూ తన స్టైల్, యాక్షన్ సన్నివేశాలతో అభిమానులను ఆకట్టుకున్నారు. ట్రైలర్‌లోని డైలాగులు, యాక్షన్ ఎపిసోడ్లు సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ప్రస్తుతం ఈ ట్రైలర్ సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌గా కొనసాగుతోంది.
ఈ ట్రైలర్‌పై మెగాస్టార్ చిరంజీవి కూడా స్పందిస్తూ చిత్రబృందంపై ప్రశంసలు కురిపించారు. తన తమ్ముడు పవన్ కల్యాణ్ నటించిన ఈ చిత్ర ట్రైలర్ తనకు ఎంతో నచ్చిందని తెలిపారు. “మ్యాజిక్ జరిగింది.. ముహూర్తం కుదిరింది.. ట్రైలర్ అదిరింది.. ఉగాదికి ‘ఉస్తాద్ భగత్ సింగ్’తో అన్నీ శుభాలే. కల్యాణ్ బాబు, హరీష్ శంకర్ మరియు మొత్తం చిత్రబృందానికి అభినందనలు” అని ఆయన సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు.
చిరంజీవి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మెగాస్టార్ నుంచి వచ్చిన ప్రశంసలతో పవన్ కల్యాణ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిరంజీవి వ్యాఖ్యలకు దర్శకుడు హరీష్ శంకర్ కూడా స్పందిస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల్లో ఉన్నప్పటికీ ట్రైలర్ చూసి అభినందనలు తెలియజేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు.
“ఉస్తాద్ భగత్ సింగ్” చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నిర్మించారు. ఈ సినిమాలో పవన్ కల్యాణ్ సరసన రాశీ ఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటించారు. సంగీతాన్ని దేవిశ్రీ ప్రసాద్ అందించగా నేపథ్య సంగీతాన్ని థమన్ సమకూర్చారు. భారీ అంచనాల మధ్య విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాల్సి ఉంది.



# స్టార్ కిడ్ నుంచి గ్లోబల్ ఐకాన్‌గా ఆలియా భట్ ప్రయాణం

బాలీవుడ్ అగ్ర నటి ఆలియా భట్ నేడు ముప్పై మూడో వయస్సులోకి అడుగుపెట్టారు. రెండు వేల పన్నెండులో విడుదలైన “స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్” చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె, కేవలం కొన్ని సంవత్సరాల్లోనే దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన నటీమణుల్లో ఒకరిగా ఎదిగారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా, వ్యాపారవేత్తగా, ఒక బిడ్డకు తల్లిగా ఆమె సాగిస్తున్న ప్రయాణం అనేక మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.
ప్రముఖ దర్శకుడు మహేష్ భట్ కుమార్తెగా సినీ రంగంలోకి వచ్చినప్పటికీ, ఆలియా భట్ తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. తొలి చిత్రానంతరం వచ్చిన విమర్శలను ఆమె సవాలుగా తీసుకుని మరింత శ్రమించారు. “హైవే” చిత్రంతో తన నటనను నిరూపించుకుని ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం వచ్చిన “ఉడ్తా పంజాబ్”, “రాజీ” వంటి చిత్రాలు ఆమెను బాలీవుడ్ ప్రముఖ నటీమణుల సరసన నిలబెట్టాయి.
దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కించిన “ఆర్ ఆర్ ఆర్” చిత్రంతో ఆమె తెలుగు ప్రేక్షకులకు కూడా మరింత చేరువయ్యారు. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వచ్చిన “గంగూబాయి కతియావాడి” చిత్రంలో అద్భుత నటన కనబరిచి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు.
అంతేకాకుండా అంతర్జాతీయ వేదికపై కూడా తన ముద్ర వేస్తూ నెట్‌ఫ్లిక్స్ నిర్మించిన “హార్ట్ ఆఫ్ స్టోన్” చిత్రంతో హాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్‌లకు ప్రతినిధిగా వ్యవహరిస్తూ గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు.
ఆలియా భట్ కేవలం నటి మాత్రమే కాకుండా గాయని, నిర్మాతగా కూడా తన ప్రతిభను చాటుతున్నారు. “ఎటర్నల్ సన్‌షైన్ ప్రొడక్షన్స్” పేరుతో నిర్మాణ సంస్థను స్థాపించి “డార్లింగ్స్” వంటి వైవిధ్యమైన చిత్రాలను నిర్మించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో కూడా ఆమె చురుకుగా పాల్గొంటున్నారు.
నటుడు రణబీర్ కపూర్‌ను వివాహం చేసుకున్న తర్వాత ఆమె వ్యక్తిగత జీవితం మరింత ఆనందంగా మారింది. ఈ దంపతులకు రాహా అనే కుమార్తె ఉంది. కుటుంబ బాధ్యతలు, సినీ జీవితం రెండింటినీ సమతుల్యంగా నిర్వహిస్తూ ఆలియా భట్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో “జిగ్రా”, “లవ్ అండ్ వార్” వంటి భారీ చిత్రాలు ఉన్నాయి. ప్రతి చిత్రంతో తన నటనను కొత్త కోణంలో చూపిస్తూ ఆలియా భట్ సినీ ప్రపంచంలో మరింత ఎత్తుకు ఎదుగుతున్నారు.



# పార్తీబన్ కూతురితో కలిసి కనిపించిన త్రిష.. ముంబై వేడుకలో సందడి

దక్షిణాది ప్రముఖ నటి త్రిష మరోసారి వార్తల్లో నిలిచింది. నటుడు పార్తీబన్‌తో గతంలో జరిగిన వివాదం తర్వాత ఆయన కుమార్తె కీర్తన పార్తీబన్‌తో కలిసి కనిపించడం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ముంబైలో జరిగిన ప్రముఖ ఫ్యాషన్ రూపకర్త ఏకా లఖానీ వివాహ వేడుకకు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.
ఈ వేడుకలో దర్శకుడు మణిరత్నం, నటుడు సిద్ధార్థ్, నటి త్రిషతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. అదే కార్యక్రమానికి నటుడు పార్తీబన్ కుమార్తె కీర్తన పార్తీబన్ కూడా హాజరైంది. ఈ సందర్భంగా త్రిష, కీర్తన ఎంతో ఆప్యాయంగా మాట్లాడుకుంటూ కలిసి ఫోటోలకు పోజులు ఇచ్చారు. ఇద్దరూ నవ్వుతూ దిగిన ఆ ఫోటోను త్రిష తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకుంటూ “ఈ తరం యువతతో నేను” అనే భావం వచ్చేలా వ్యాఖ్యను జోడించింది. ప్రస్తుతం ఆ చిత్రం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.
పార్తీబన్‌తో గతంలో జరిగిన వివాదం తర్వాత కూడా ఆయన కుమార్తెతో త్రిష స్నేహపూర్వకంగా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంది. తండ్రి చేసిన విషయాన్ని పక్కన పెట్టి కూతురితో ఆప్యాయంగా మెలగడం ఆమె పెద్ద మనసుకు నిదర్శనమని పలువురు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.
ఇదిలా ఉండగా, కీర్తన పార్తీబన్ చిన్ననాటి నుంచే సినిమాల్లో కనిపించింది. దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన “కన్నత్తిల్ ముత్తమిట్టాల్” చిత్రంలో ఆమె బాలనటిగా నటించింది. ఇక త్రిష ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉంది. తమిళంలో సూర్య హీరోగా, దర్శకుడు ఆర్జే బాలాజీ రూపొందిస్తున్న “కరుప్పు” చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం మే నెలలో విడుదలయ్యే అవకాశముందని సమాచారం. అలాగే తెలుగులో మెగాస్టార్ చిరంజీవి హీరోగా రూపొందుతున్న “విశ్వంభర” చిత్రంలో కూడా త్రిష కీలక పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుండటంతో త్రిష మరోసారి తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

# ఏఐతో “బాహుబలి” 5 లక్షల్లో తీయొచ్చు.. రాంగోపాల్ వర్మ వ్యాఖ్యలు వైరల్

వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచే దర్శకుడు రాంగోపాల్ వర్మ మరోసారి తన వ్యాఖ్యలతో చర్చనీయాంశంగా మారాడు. ఇటీవల ఒక పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ప్రభావం సినీ పరిశ్రమపై ఎంతగా ఉండబోతుందో వివరించాడు. ముఖ్యంగా భారీ బడ్జెట్ సినిమాల నిర్మాణ విధానం భవిష్యత్తులో పూర్తిగా మారిపోతుందని ఆయన అభిప్రాయపడాడు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, దీని ప్రభావం సినీ పరిశ్రమపై తీవ్రంగా పడే అవకాశం ఉందని వర్మ పేర్కొన్నాడు. భారీ సెట్లు, విస్తృత దృశ్య ప్రభావాలు, పెద్ద స్థాయి నిర్మాణ వ్యయాలు అవసరమయ్యే చిత్రాలను కూడా భవిష్యత్తులో చాలా తక్కువ ఖర్చుతో రూపొందించే పరిస్థితి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డాడు. ఉదాహరణగా “బాహుబలి”లాంటి భారీ చిత్రాన్ని కూడా కేవలం ఐదు లక్షల రూపాయల ఖర్చుతో రూపొందించగలుగుతామని వ్యాఖ్యానించాడు.
అదే సమయంలో సహజ నటన, భావోద్వేగాలతో నడిచే కథల చిత్రీకరణ మాత్రం కృత్రిమ మేధస్సుతో అంత సులభంగా సాధ్యం కాదని ఆయన చెప్పాడు. సాధారణంగా కెమెరాతో తీసే కథా చిత్రాలు కొన్నిసార్లు ఎక్కువ ఖర్చు అయ్యే అవకాశం కూడా ఉందని పేర్కొన్నాడు. భారీ దృశ్య ప్రభావాలు, విస్తృత సెట్లను కృత్రిమ మేధస్సు ద్వారా సులభంగా సృష్టించవచ్చని ఆయన వివరించాడు.

# మోహన్ బాబు ప్రతిభ అందరికీ తెలియదు.. శ్రీకాంత్ ఓదెల వ్యాఖ్యలు వైరల్

తిరుపతిలో నిర్వహించిన మోహన్ బాబు విశ్వవిద్యాలయం ముప్పై నాలుగో వార్షికోత్సవ కార్యక్రమంలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం నాని హీరోగా తెరకెక్కుతున్న “ది ప్యారడైజ్” చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఆయన “శికంజ మాలిక్” అనే ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు.
ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీకాంత్ ఓదెల, నటుడిగా మోహన్ బాబు సామర్థ్యం ఎంత గొప్పదో కొందరు ప్రేక్షకులకు పూర్తిగా తెలియదని అన్నారు. వెండితెరపై మనం మిస్సవుతున్న మోహన్ బాబును మరోసారి చూపించేందుకు తాను శాతం శాతం కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం సినిమా గురించి అంతకంటే ఎక్కువ చెప్పలేనని, త్వరలో విడుదలయ్యే టీజర్ మరియు ట్రైలర్ ద్వారా ఆయన పాత్ర గొప్పతనం ప్రేక్షకులకు స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ఇక నాని అభిమానులు చిత్రానికి సంబంధించిన తదుపరి అప్‌డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ చిత్రం రెండు వేల ఇరవై ఆరు ఆగస్టు ఇరవై ఒకటో తేదీన ఘనంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా తనికెళ్ల భరణి కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన నాని, మోహన్ బాబు పోస్టర్లు మరియు గ్లింప్స్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ఈ చిత్రంలో జాతీయ పురస్కార విజేత నటి సోనాలి కులకర్ణి కూడా ముఖ్య పాత్రలో నటిస్తుండగా రాఘవ్ జుయల్ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్ ఎల్ వి సినిమాస్ పతాకంపై నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. గతంలో “దసరా” చిత్రంతో విజయాన్ని అందుకున్న నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ మళ్లీ కలవడం, అలాగే నాని - అనిరుధ్ కాంబినేషన్ మరోసారి రావడంతో “ది ప్యారడైజ్”పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in